# ప్రేయసీ వద్దకు ప్రయాణం

శ్రీ గిడుగు వేంకటరామమూర్తి

| | | |
|---|---|---|
| మాధవరావు | : | తండ్రి |
| మోహనరావు | : | మేనల్లుడు |
| కృష్ణమూర్తి | : | కొడుకు |
| రమేష్ | : | కొడుకు స్నేహితుడు |
| ప్రకాశరావు | : | ఇంటివాడు |
| గోపాల్ | : | ఇంటి వైద్యుడు |
| సుశీల | : | కూతురు |

## 1–వ రంగం

[మాధవరావు యిల్లు. మధ్య తరగతి కుటుంబం వారిదన్నట్టు గది అమర్చబడి ఉంటుంది. 1 టేబుల్, 3 కుర్చీలు, గోడకు గడియారం, పెద్ద ఆఫీస్ కేలండర్, అతని భార్యఫోటో పెద్దది ఒకటి ఉంటాయి. ఫిబ్రవరి 7–వ తేదీ, సాయంత్రం 6 గంటల సమయం. సుశీల అప్పుడే ఆఫీసునుండివచ్చి, చీకటిగా ఉండగా పాట పాడుకుంటూ దీపం వెలిగిస్తుంది. తర్వాత పాడుతూ యిల్లు సవరించి చక్క జేస్తుంది.]

సుశీల:— విద్యయె విజ్ఞానం
విజ్ఞానమే స్త్రీలకు ఆభరణం ||వి||
మనమున విరసే పువ్వం
హృదయములు కరగే గానం
మదిలో కలుగానందం
విద్యయే విడరాని విత్తం ||వి||
అదియే ఒక తరచని సంద్రం
గనిలో తరగని బంగారం ||అది||
శ్రీ జాతిలో కలిగే వికాసం
మానవజాతికనంత ప్రమోదం ||వి||

మాధవ:— [ఆఫీస్ నుండి అప్పుడే వస్తాడు. కండువాను సుశీల అందుకుంటుంది. చొక్కా చిరిగి ఉంటుంది.]

ఎంతసేపయిందమ్మా నువ్వు ఆఫీస్ నుండివచ్చి?

సుశీల:—ఇప్పుడేనండీ, పదినిమిషాలవుతుంది ... మీరు యివాళ వేగం వచ్చారే!

మాధవ:—ఆఁ. ఏదో యివాళ వేగంపోనిచ్చారు. ఇవాళ జీతాలు యిచ్చే రోజుకదూ! అందుచేత అందరూ వేగం పోతాం అంటే ఏమి అనలేక వదిలిపెట్టారు.

సుశీల:—బాగుందండీ మీ ప్రెస్ పని! రోజూ ఉదయం ఎనిమిది గంటలకు వెళ్లి రాత్రి ఎనిమిది గంటలకు రావడం! ఫ్యాక్టరీ యాక్టు ప్రకారం రోజుకు ఎనిమిది గంటలే కదండి పనిచేయాలి! ఈ మిగిలిన నాలుగు గంటలకు O. T. యిస్తారా?

మాధవ:_ఏమిటమ్మా అన్నావు! ఓ. టి. అం. ఓవర్ టైమ్ పనిచేసే లేబరర్సుకేనట! మేమంతా ఆఫీసుస్టాఫ్! మాకు యివ్వనన్నాడు ప్రొప్రైటరు. ఒకరిద్దరు ఫాక్టరీ ఇన్‌స్పెక్టరుకు రిపోర్టు చేస్తే వాళ్లకు ఒక్కొక్క నెల జీతమిచ్చి యింటికి పంపించాడు. గట్టిగా అడిగితే నాకూ అదే గతి పడుతుందని భయం. అందుకని మాట్లాడకుండా పనిచేస్తున్నాను.

సుశీల:_ఇలా మీరు రోజుకు 12 గంటలు పనిచేస్తే మీ ఆరోగ్యం ఏమవుతుంది చెప్పండి?

మాధవ:_ఏమయినా సరే తప్పదు. నువ్వు ఈ పాటికి కాపురంచేస్తూ ఉండవలసిన దానివి. నీ చేత పనిచేయించి, నీ ఆర్జనమీద కుటుంబము నడుస్తూవుంటే నేను చూస్తూ ఊరుకోగలనా? మన మిద్దరము సంపాదిస్తేనే చాలీ చాలకుండ గడుస్తోంది. ఇలా కష్టపడి నేను పనిచేయక పోతే మరి అడగక్కరలేదు....

సుశీల:_సరేగానండీ! ... నాన్నగారూ! మీ జీతం అందిందికదా రెండు చొక్కాలు కుట్టించుకోకూడదూ?

మాధవ:_అమ్మాయ్! అప్పులుతీరి అవతలపడితే చొక్కాలు కుట్టించుకున్నట్టే!

సుశీల:_అప్పులు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. అవి త్వరలో తీరేవయితే బాగానే ఉండును. అందుకనే మీరు ఈ వయసులో ఉద్యోగము చేస్తూంటే వద్దనలేకుండా ఉన్నాను.

మాధవ:_ మీ అన్న చదువు పూర్తి అయితే మనం గట్టుఎక్కినట్టే! ఈ మూడు నెలలూ ఎలా గడుస్తాయో?

సుశీల:_చదువు పూర్తయితే సరా! వాడికి వెంటనే ఉద్యోగం దొరకవద్దూ!

మాధవ:_ఉద్యోగం దొరక్కపోయినా వాడికి నేనే డబ్బు ఎత్తిపంపించనక్కరలేదుగా? అప్పుడంత కష్టమనిపించదు. అంతవరకు మనకు ఈ పాట్లు తప్పవు.

సుశీల:_సరేగాని; మీరు వెళ్లి రెండు చొక్కాలకు గుడ్డలు కొనుక్కురండి. ... ...

మాధవ:_ఇవ్వవలసినవన్నీ లెక్కవేశావా? మిగిలితే చూద్దాం.

సుశీల:_వేశాను (పద్దుపుస్తకంతీసి చదువుతుంది) పాలు పెరుగు పది; బొగ్గులు కట్టెలు పది. కిరానీ బియ్యం ముప్ఫైఅయిదు. చాకలికి అయిదు. ఇవి మొన్న నేను యిచ్చేశాను.

మాధవ:_నీ జీతం 60/— సరిగ్గా అయిపోయింది. నీ చేతిలో కానీ మిగలలేదన్నమాట! ఇంకా మిగిలిన బాకీలు!

సుశీల:_అద్దె_15, రమేష్‌కి_15, డాక్టరుకు_10, అన్నయ్యకు_20 పంపించాలి.

మాధవ:_నా అరవైకి లెక్కవేసి పెట్టావు. ఇంకేం మిగులుతుంది?...... నెలపొడుగునా ఖర్చు! ... ఈ లెక్కల ప్రకారము జరిగినా బాగుండేది.

సుశీల:_ఏం?

మాధవ:_మొన్న రెండు రోజులు సెలవు పెట్టాను. చూడు - ఒక రోజు జీతంపట్టుకున్నారు.

సుశీల:_అదేమిటండీ మరీ అన్యాయంగాఉంది మీ Press పని! ఓ. టి. యివ్వరూ, ఇవ్వరు; సెలవు పెడితే జీతం పట్టుకుంటారా - చాల బాగుందండీ! అడిగేవాళ్లులేక ...

మాధవ:_ఏంచెయ్యమన్నావు? నా జీతం 60/— కాదు. 50/— అనుకుంటాను; ఆ పది రూపాయిలు ఓ. టి. గా యిస్తున్నారని సంతోషిస్తాను.

సుశీల:_మీ సంతోషం భలేబాగుందండీ!

మాధవ:—ఔను — ఎక్కడి కక్కడ సంతోషిస్తూ ఉండాలి. ఈ ఉద్యోగము వదిలితే మళ్ళీ నాకు ఉద్యోగంయిచ్చే వాడెవడు?......మా ప్రొప్రైటరు అంటూఉంటాడులే "ఈ ముసలివాళ్ళకు ఉద్యోగం ఇవ్వటంవలన నష్టం వస్తూన్నది; పని తొందరగా చేయలేరు. రోజులో చేయవలసినపని రోజున్నర చేస్తారు. అయినా నమ్మకంగా చేస్తారని ఉంచవలసి వస్తోం"దని.

సుశీల:—ప్రొప్రైటర్లు ఎలాగైనా అంటారు. వాళ్ళకు కావలసినది లాభం ... ...

మాధవ:—నేను అలా వెళ్ళి డాక్టరుకు 10 రూ. యిచ్చి వస్తాను. తక్కినది నీ వద్దఉంచు (డబ్బు యిస్తాడు)

సుశీల:—డాక్టరు Bill యింకా ఎంత ఉంటుంది ?

మాధవ:—ఇంకో పాతిక ఉంటుందనుకుంటాను.

సుశీల:—ఇంకా పాతికఉందీ! అమ్మపోయినా డాక్టరు బిల్లు మాత్రము బ్రతికియున్నది.

మాధవ:—రోగి చనిపోయినంత మాత్రాన డాక్టరు బిల్లుచేయడం మానేస్తాడనుకున్నావా? పేషంటు చచ్చినా, బ్రతికినా బిల్లు చెల్లించితీరవలసిందే. మన డాక్టరు యింకా చాల నయం - ఎంత యిచ్చినా పుచ్చుకొని తృప్తిపడతాడు "Bill చెల్లించనిదే మందు యివ్వ"ననడు. అందుకు మనం సంతోషించాలి.

సుశీల:—మంచిరోజు లొస్తాయనుకొంటూ మనం కాలం గడపవలసిందేనా ?

మాధవ:—అమ్మాయ్! నిన్నుచూస్తే నాకు జాలి వేస్తుంది. ఉదయమే 5 గంllలకు లేస్తావు. నా కోసమని వంట వేగంగా చేస్తావు. నీ ఆఫీసుకు వెళ్ళి అక్కడ కష్టపడి పనిచేసివస్తావు. మళ్ళీ రాత్రి వంట—నీకు విశ్రాంతిలేదు. నేను సాయం చేద్దామంటే వీలుకాకుండాఉంది.

సుశీల:—ఆడదాన్నయి పుట్టిన తరువాత వంటచేయకుండా జరుగుతుందా ?

మాధవ:—అలాగని ఒక్కవంటే చేస్తున్నావా ? ఉద్యోగంకూడ చేస్తున్నావు.

సుశీల:—చదువు చెప్పించినందుకు ఆ మాత్రం మీకు తోడుగా ఉద్యోగంచేసి ఆర్జించటంతప్పా ?

మాధవ:—అందుకనే నువ్వు నా కొక కొడుకు వంటూటాను.

సుశీల:—మీరు వెళ్ళిరండి నాన్నగారూ! (మాధవరావు వెళ్తాడు. సుశీల చింకి చొక్కాలు కుడుతూ పాట పాడుకుంటుంటుంది.)

రమేష్:—(ప్రవేశించి) మాధవరావుగారూ ?

సుశీల:—ఎవరది ? ... ... ఓ! మీరా!

రమేష్:—మీ నాన్నగారు లేరూ ?

సుశీల:-లేరండీ.

రమేష్:—ఎక్కడికి వెళ్ళారు ?

సుశీల:—వీధిలోకి.

రమేష్:—అంటే ?

సుశీల:—డాక్టరు యింటికి.

రమేష్:—ఏం ?

సుశీల:—ఏంలేదు - డబ్బు చెల్లించి రావడానికి.

రమేష్:—నా బాకీ యింతవరకు చెల్లించలేదే ?

సుశీల:—ఇవాళేకదండీ ఆయన జీతం అందింది.

రమేష్:—ఆయన జీతం ఎప్పుడందితే నాకేం? ప్రతి నెలా 1-వ తేదీకి చెల్లుకొడుతూ ఉంటానని ఒప్పుకున్నాడు.

సుశీల:—మీరు తప్పదంటే వచ్చేనెలనుంచి నా జీతం అందంగానే చెల్లుకొడతారులెండి.

రమేష్:—ఆఁ, ఊరకే అన్నాను నువ్వు ఏమంటావో అని. మీరు యిచ్చినా యివ్వకపోయినా నేను అడగదలచుకోలేదు. మీఅన్నయ్యా నేను ప్రాణ



4

స్నేహితులంగదా ! ఆ మాత్రం వెనుకముందూ అయితే సర్దుకోలేననుకున్నావా !

సుశీల:—అందునుంచే మాకు కొంతధైర్యంగా ఉండి మీదివెనుక నెడుతూ వచ్చాము.

రమేష్:—అసలు యివ్వనే వద్దంటే మీనాన్నగారు వినరు. అనవసరంగా బాధపడుతున్నారు. ఇన్ని బాధలుపడకుండా హాయిగా ఉండండి అంటే వినరు.

సుశీల:—మాకెలా వీలవుతుంది?

రమేష్:—ఎందుకు వీలుకాదు ? నేను చెప్పినట్టు చేయండి. ...ఏం చెప్పమన్నావా ? ... నీ కిష్టమయితే -

సుశీల:—(గ్రహించి) అదేదో నాన్నగారితోనే చెప్పండి

రమేష్:—నువ్వు ఒప్పుకుంటేగాని ఆయన ఏదీ చేయరు!

సుశీల:—నా యిష్టాయిష్టాలు ఆయనకు బాగా తెలుసును.

రమేష్:—నువ్వు పాపం చాలా కష్టపడుతున్నావు... నేను...

సుశీల:—పాపం ! చూడలేకుండా ఉన్నారు కాబోలు! ఎంతటి ఉదార స్వభావులు !

రమేష్:—నేనుచెప్పినట్టు చేస్తే నా ఉదార స్వభావం నీకే తెలుస్తుంది ... నిన్ను ...

సుశీల:—మీ ఉద్దేశం నాకు అర్థమయింది కాని ...

రమేష్:—కాని ?

సుశీల:—నా కిష్టంలేదు.

రమేష్:— నేనంటే నీ కిష్టంలేదూ ?

సుశీల:—ఔను.

రమేష్:— నేను ఆ మోహనరావుకన్నా తీసిపోయానా?

సుశీల:—మీ కున్నంత ధనం అతనికి లేకపోయినా నా దృష్టిలో మీ కన్నా అతను గొప్పవారే !

రమేష్:—ఆ దొంగ - నీచుడు నీకు ప్రియుడు ! చాలా మంచివాడ్ని ప్రేమించావు !

సుశీల:—మీరు అన్నయ్యకు స్నేహితులని చనువుగా మాట్లాడుతున్నానని నాస్వవిషయాలలో జోక్యం కలుగచేసుకుంటున్నారు, మీకు అనవసరం; మీరు మీ దారిని వెళ్లవచ్చు [అంటూ చాలా నిరసనగా లోనికి వెళ్తుంది.]

రమేష్:—సరే - నా తడఖా చూద్దువుగాని (పోబోతాడు మాధవరావు ఎదురవుతాడు.)

మాధవ:—ఏం రమేష్, ఎంతసేపయిందివచ్చి ?

రమేష్:—ఇప్పుడే.

మాధవ:—నీ కెందుకూ శ్రమ మీ యింటికి నేనువచ్చి యిస్తాగా ?

రమేష్:—శ్రమకేముంది ... ఏం అలా ఉన్నారు ?

మాధవ:—జీతాలు వచ్చేవరకు ఎప్పుడొస్తాయా అని కనిపెట్టుకుని ఉండడం, తీరా జీతాలొస్తే, ఎలా సర్దడమా అని ఆలోచన.

రమేష్:—మీరు ఎన్నాళ్లు యిలా యిబ్బందులు పడతారు ?

మాధవ:—ఏం చెయ్యను నాయనా ?

రమేష్:—హాయిగా విశ్రాంతి తీసుకోవలసిన వయసులో మీరు యింకా ఉద్యోగం ...

మాధవ:—నా దుర్దినాలు !

రమేష్:—దుర్దినాలంటే లాభం ఏమిటి ? మీరు కోరి కష్టాలు కొనుక్కుంటున్నారు. ... అసలు యింత వరకు మన ఊళ్లో ఆడవాళ్లు ఉద్యోగాలు చేయ లేదు; మన సుశీలే మొదటిది. అందుకే ఊళ్లో నలుగురు నానా విధాలుగా అనుకుంటున్నారు.

మాధవ:—మనం ఏంచేయగలం !

రమేష్:—దానికి తోడు సుశీల ఆఫీస్‌నుండి వస్తూ మోహన్‌రావుతో మాట్లాడడం చూసి నలుగూరు ఏమనుకుంటూన్నారో మీకేం తెలుసు ?

మాధవ:_అనుకుంటే అనుకుంటారు ... అయితే ఏం చేయమంటావ్!

రమేష్:-శీఘ్రంగా మీ అమ్మాయికి మొదట పెళ్ళి చేయండి!

మాధవ:_దాని పెళ్ళిచేసే తాహతు నాకుంటే మీ చేత మీ చేత నేనెందుకు మాటలనిపించుకుంటాను చెప్పు!

రమేష్:-మీరు మరోలా అనుకోనంటే చెప్తాను.

మాధవ:_నా మేలు కోరి నువ్వు చెప్తూంటే నేను యింకోలా ఎలా అనుకుంటాను?

రమేష్:-మీ అమ్మాయిని చేసుకోవాలని నాకుంది.

మాధవ:-(నవ్వుతో) ... కాని దానికి యిష్టముండ వద్దూ?

రమేష్:-మీ మాట కాదంటుందా?

మాధవ:-చదువుకున్నది, దాని బాగోగులు అది చూసుకోగలదు. ఆ విషయంలో దాని యిష్టమే నా యిష్టం.

రమేష్:-బాగా ఆలోచించండి; ఉభయ ఖర్చులూ నేను పెట్టుకుంటాను. మీ అప్పులన్నీ నేను తీర్చేస్తాను. కృష్ణమూర్తి ఏం చదువుతానంటే ఆ కోర్సు చదివిస్తాను. ఏ కష్టమూ లేకుండా హాయిగా మీరు ఉండవచ్చును _ ఏమంటారు?

సుశీల:_హల్లో మిష్టర్ రమేష్! నువ్వు చెప్తున్నదంతా వింటూనే ఉన్నాను. మా మీద ఎంతో అభిమానం ఉన్నవాడిలా మాట్లాడుతున్నావ్. నీ డబ్బును పెట్టి నన్ను కొందామనుకుంటున్నావా? నీ డబ్బునన్ను కొనలేదని మాత్రం తెలుసుకో! లేనిపోనివి కల్పించి నన్ను చులకన చేయాలని ప్రయత్నిస్తే ఏం లాభంలేదు. మా ఫామిలీ మేటర్సుతో నీకేం సంబంధం? ... మోహన రావంటే ఎవరో అనుకుంటున్నావేమో! అతను నీకన్నా ఎక్కువగా చదువుకున్న ఒక గ్రాడ్యుయేట్. చిన్నప్పట్నుంచి మా యింట్లో పెరిగిన వాడే!

రమేష:-వాడెవడో నాకు బాగా తెలుసును. ఇంత వరకు పట్టుబడని జేబుదొంగలలో ఘనుడు. వాడి ప్రవర్తన లోకవిదితం! ... మాధవరావు గారూ! నేను వెళ్తున్నాను. బాగా ఆలోచించుకోండి _ తర్వాత విచారిస్తేలాభంలేదు. [రమేష్ బెదిరిస్తున్నట్టుగాచూసి వెళ్తాడు. ఇద్దరూ అటు వైపు తీక్షణంగా చూస్తారు.]

మాధవ:_ఏమిటమ్మా యిదంతానూ? నువ్వు మోహన్‌తో తిరగడం ఏమి బాగులేదు.

సుశీల:-అప్పుడప్పుడు నేను ఆఫీసునుండి వస్తున్నప్పుడు నా వెంట మోహన్ రావడం నిజమే. అంత మాత్రంచేత నా శీలాన్ని పాడుచేసుకుంటానను కోవడం పొరపాటు.

మాధవ:_నీ శీలాన్ని నువ్వు కాపాడుకోగలవని నాకు తెలుసు...(కోపంగా)...ఆ తుచ్ఛుణ్ని యింటికి రావద్దంటే తోవలు కాస్తున్నాడన్న మాట!

సుశీల:_అప్పుడప్పుడు యింటికికూడా వస్తున్నాడు

మాధవ:_ఆఁ

సుశీల:_నేనే రమ్మన్నాను. ఎప్పటికైనా అతనికి బుద్ధి వచ్చేటట్టు చేయాలని నా ప్రయత్నం.

మాధవ:-అలాచేసి మనవంశ మర్యాదను నాశనం చేస్తున్నావన్నమాట! ఈ సారి వాడు యీ గుమ్మం ఎక్కనీ ..

సుశీల:-మీరు కొంచెం నిదానంగా ఆలోచించండి నాన్నగారూ! మోహన్ చదువుకున్నవాడు. అతన్ని మంచి త్రోవలో పెట్టడానికి మీరూ ప్రయత్నించాలి. అంతేగాని మీరూ లోకంతో కలిస్తే ఎలాగ?

మాధవ:-చదువుకుని అన్నీ తెలిసినవాడు తప్పుత్రోవ పడితే ఎవరేం చేయగలరు? వాడితో నువ్వు

తిరగడంగాని వాడిక్కడకు రావడంగాని మంచిది కాదు. నీ చేతులతో నీ భవిష్యత్తును పాడు చేసుకోకు - నా మాటవిను - నీ మంచికే చెబుతున్నాను.

సుశీల:_అతనిలో ఏ నాటికైనా పరివర్తన తీసుకు రావాలని నాకుంది; తీసుకు రాగలనన్న నమ్మకం కూడ ఉంది.

మాధవ:-తేగలిగితే మంచిదే! సంతోషమే! ... నా చెల్లెలి కొడుకు నాకళ్ళముందు యిలా తయారయినందుకు నాకు చాలా కష్టంగా ఉంది...వాడికి చదువు చెప్పించాను. వాడి చదువుకోసమని చాలా అప్పుచేశాను. బుద్ధిమంతుడవుతాడనుకున్నాను. కాని వీడు నా మర్యాద తీస్తాడనుకోలేదు... దొంగతనం చేసి బ్రతక్కపోతే అడుక్కుని తిన కూడదూ ?...ఆనీచుడు యింటికివస్తే నేను సహించలేను. వాడిని రానివ్వవద్దు...వాడు నాపరువు మర్యాదా తీస్తున్నాడు.

సుశీల:_దీనంతటికీ ఎవరు కారణం? ఎవరు?... మీరు !

మాధవ:_(కోపంగా) ఏమంటున్నావు? నేనా? సుశీలా నీ యిష్టంవచ్చినట్టూ మాట్లాడుతున్నావు !

సుశీల:_ఉట్టినే ఆగ్రహించవస్తే ఏం ప్రయోజనం? ఇన్నాళ్లుమీరు అతన్ని కొడుకులాగ చూశారు. మీ దగ్గరఉన్నన్నాళ్లు చాలా మర్యాదగా ఉన్నాడు. ...చెట్టును పెంచి అది పళ్లుపండకముందే కోపం వచ్చి దాన్ని నరకినట్టు మీరతన్ని బయటకుపంపించారు. పాసవగానే యీరోజుల్లో ఉద్యోగాలు దొరుకుతున్నాయా! మీరు తొందరపడ్డారు_ బయటకు పంపించారు. నిరుద్యోగుల లిస్టులో చేరాడు.-తిండికిగతిలేక తప్పుదారి పట్టాడు.

మాధవ:_అడుక్కుని తినమను.

సుశీల:_ఎడ్యుకేటెడ్ బెగ్గర్సుకు అన్నంపెట్టేదెవరు? అది మాత్రం మీ మర్యాదకు భంగంకాదా? కూలిపనిచేసుకుని బ్రతికినా మీ మర్యాదకు భంగమే.

మాధవ:_అయితే దొంగతనం చెయ్యవచ్చునంటావ్ ?

సుశీల:_నేను అనను. తప్పుదారిపట్టాడు. అతన్ని మనం మంచి దారిలో పెట్టాలి.

మాధవ:_లాభంలేదు.

సుశీల:_ప్రయత్నించాలి ... ప్రయత్నించి చూస్తాను.

మాధవ:_నీ యిష్టం, నీ ఖర్మం! వాడూ నువ్వూకలిసి ఏగంగలో దిగుతారో దిగండి. ... తల్లిలేని పిల్లవని ముద్దుచేసి, పెంచి, పెద్దచేసినందుకు నాకే పాఠాలు నేర్పాలని చూస్తున్నావ్! నీ తల్లే బ్రతికిఉంటే యీ వేషాలు వేశాదానివా? నీ యిష్టంవచ్చినట్టు_నీ ఖర్మం_వాడితోకలిసి నువ్వు కూడా పో. [కోపంగా వెళ్తాడు; సుశీల దుఃఖం పట్టలేక 'అమ్మా' అంటూ తల్లిఫోటో దగ్గరకు వెళ్తుంది.]

సుశీల:_[దీనంగా]

ప్రేమాజాలిలేదా ?<br>
నా పైనా కరుణేలేదా ?<br>
కష్టం నష్టాలేనా - జీవితమింతేనా ?<br>
నా జీవిత మింతేనా ? ॥ప్రేమా॥<br>
చిరుతాప్రాయా దినాలే మరిరావా ?<br>
నీ కూతురు మాటే చూడ మరచావా ?<br>
బీద తనమే - నా పాలిటిదియా ?<br>
వ్రాసి పెట్టితివా ? అమ్మా దాచీ పెట్టితివా ?<br>
నీ ప్రేమే పోయినదా ? ॥ప్రేమా॥

[పాట పూర్తయిన తర్వాత కుర్చీలో కూలబడి విచారంగా ఉంటుంది.]

ప్రకాశ:_[ప్రవేశించి] మాధవరావుగారూ !

సుశీల:_[తన దుఃఖాన్ని, తెలియనివ్వకుండాలేచి] లేరండీ.

ప్రకాశ్:—అద్దె యింకా యివ్వదలచుకోలేదా మీరు?

సుశీల:—ఇప్పుడే గదండీ మీరు వచ్చారు! ... ఒక నెలది యిమ్మన్నారు, యిదిగో తీసుకోండి [యివ్వబోతుంది.]

ప్రకాశ్:—ఒక నెలదీ? ఒక నెలదిస్తే ఏమన్న మాట? పాతబాకీ? మీరు రెండు నెలలది బాకీ, మీరు యిల్లు ఖాళీచేస్తేగాని లాభంలేదు. ఈ నెల అద్దెకూడా మీ వద్దనే ఉంచుకోండి.

సుశీల:—త్వరలో మీ బాకీ తీర్చేస్తాంగాని మీకు యివ్వకుండా ఎక్కడికిపోతాం చెప్పండి!

ప్రకాశ్:—ఇలా మీరు ఆరు నెలలబట్టి చెపుతున్నారు; ఇవ్వలేకపోతే యిల్లు ఖాళీచేసి వెళ్ళండి. ఇంక ఎవరైనా దిగితే అద్దె ఎక్కువ వస్తుంది. [మోహన్ రావు ప్రవేశిస్తూనే ప్రకాశరావు జేబులోనుండి పర్సు కొట్టేసి, ప్రకాశరావుకు కనబడకుండా నిలబడతాడు.]

ప్రకాశ్:—ఇల్లు త్వరలో ఖాళీచేయాలని నేను చెప్పానని మీ నాన్నగారితో చెప్పు. ఖాళీచేయకపోతే ఖాళీ చేయించవలసి వస్తుందనికూడా చెప్పు.

మోహన్:—[ఎదురుగావచ్చి] ఏమిటండీ సంగతి?

ప్రకాశ్:—నీసంగతికాదు.

మోహన్:—ఆడదాన్నిచేసి ఏమిటో చాలా జోరుగా తమరు మాట్లాడుతున్నారు, తమరు మాటలు కొంచెం తిన్నగా రానిస్తే మంచిది.

ప్రకాశ్:—అద్దె యివ్వడానికి గతిలేదుకాని ...

మోహన్:—కొంచెం ఒళ్లు దగ్గిర పెట్టుకుని మాట్లాడు మర్యాద తప్పేవంటే మూతి పళ్లు రాల్తాయి... నీకు అద్దె ఎందుకివ్వాలి? ఈ గుల్లకొంపలకి సున్నంవేయించి ఎంతకాలమయింది? కిటికీ ఒకటి పెట్టించమంటే మాట్లాడవేం? అద్దె మాత్రం నీకు కావాలీ!

ప్రకాశ్:—నేనేం చేయించను. నీకు యిష్టంలేకపోతే ఖాళీచేసి వెళ్లు. ఉండమని బ్రతిమాలేనా?

మోహన్:—ఖాళీ చేయించాలనేకదూ ఎలక్ట్రిక్ కనక్షను కట్ చేశావ్? ఆ విషయమై యింకా నీ యింటికి వద్దామనకుంటున్నాను.

సుశీల:—ఎందుకు మోహన్ దెబ్బలాట?

మోహన్:—సుశీలా! ఒక్క దమ్మిడీకూడా వీడికి యివ్వకు, వీడి తాతతో చెప్పకోమను. నేను పోయి పోలీసుకు Complaint యిచ్చి వస్తాను.

ప్రకాశ్:—ఎందుకు? నేనేం చేశానని? అద్దె అడిగితే తప్పా? రిపోర్టు చేసుకో.

మోహన్:—ఆడది ఒంటరిగా ఉన్నప్పుడు యింట్లో జొరబడి అల్లరిచేయాలని ప్రయత్నించినందుకు. నేను రాకపోతే నువ్వు ఏమయినా చేసేవాడివి!

ప్రకాశ్:—ఇదొకటా? నువ్వు ఎంతపనైనా చేయగలవు! నీకు పోలీసువాళ్లందరూ తెలుసునని కూడా నాకు తెలుసు.

మోహన్:—నా సంగతి నీకు బాగా తెలుసునుగదా మరి?

ప్రకాశ్:—నేను వెళ్తాను; మీ మామ ఉండగా వస్తాను. నా కెందుకీ లేనిపోని నింద? [పోబోతాడు.]

మోహన్:—ఆగు! వెళ్లడానికి వీల్లేదు! [ఆపుతాడు.]

ప్రకాశ్:—ఎందుకు? నన్ను పోనీయ్.

మోహన్:—ముందు అద్దె అంతా ముట్టినట్టు ఒక రసీదువ్రాయి. ... ఊఁ ... వ్రాయి. [జడుస్తూ ప్రకాశరావు వ్రాస్తాడు.] ... ఇల్లు త్వరలో బాగుచేయిస్తానని ఒక హామీ వ్రాయి. [జడుపుతోనే అదికూడా పూర్తిచేస్తాడు.] ఇలా యియ్యి.

ప్రకాశ్:—అద్దో!

మోహన్:—భయపడకు; అద్దె యిస్తాలే యిలా యియ్యి. [ప్రకాశరావు యిస్తాడు; పుచ్చుకుని] ఇక వెళ్ళు.

ప్రకాశ:—ఏమిటీ దౌర్జన్యం!

మోహన్:—ఏం బ్లాక్‌లో సంపాదించింది చాలదూ? ... పోనీ తీసుకో; ఇంద. [డబ్బు యిస్తాడు.] ఎలక్ట్రిక్ కనక్షన్ పెట్టించు.

ప్రకాశ:—అలాగేనండి. [సంతోషంతో వెళ్తాడు.]

సుశీల:—నువ్వెందుకు యిచ్చావు?

మోహన్:—వాడిది వాడికిచ్చేశాను.

సుశీల:—అంటే?

మోహన్:—నిన్న వాడు బ్లాక్‌లో సంపాదించింది నేను యిప్పుడే వాడి జేబులోనుండి కొట్టేసి అందులోది కొంచెం యిచ్చేను. ఇదిగో మిగిలినది.

సుశీల:—మాగొప్పపని చేశావ్! ఆ పాపపు సొమ్ములో మాక్కూడా భాగం యిచ్చావన్నమాట!... మోహన్! ఇక్కడకు నువ్వెందుకొచ్చావ్?

మోహన్:—నేను రాకపోతే యీ దుష్టుడు యింకా ఎన్ని కూతలు కూసేవాడో!

సుశీల:—నువ్విలా దొంగతనాలు చేసి బ్రతికినన్నాళ్ళు మా యింటికి నువ్వు రావద్దు.

మోహన్:—రాకుండా ఉండలేను సుశీలా!

సుశీల:—నలుగురిలో నన్ను నవ్వులపాలు చేయాలని ఉందా? ఊళ్లో నలుగురు ఏమనుకుంటున్నారో తెలుసా?

మోహన్:—ఏమనుకుంటే నాకేం?

సుశీల:—నీకు కాదు; నాకు! నీనుంచి నేను ఉద్యోగం మానుకోవలసి వస్తుందేమో!

మోహన్:—ఈ మాత్రానికే! ఒక దగ్గిర బంధువు, నీ మేనత్తకొడుకు నీయింటికి వచ్చినంత మాత్రానికే!

సుశీల:—అందుకు కాదు. నీ గుణగణాలనుబట్టి మాకు చెడ్డపేరు వస్తోంది. మా యిద్దరిపరువు తీయదలచుకున్నావా? ... నువ్వు నాతో మాట్లాడడం నాకు తలవంపులుగా ఉంది.

మోహన్:—సుశీలా! చిన్నప్పట్నుంచి ఒక చోట పెరిగాం. ఒక చోట తిన్నాం; ఒక చోట ఆడుకున్నాం. ఆ చనువుచేత నిన్ను చూడండే ఉండలేకుండా ఉన్నాను. ఇప్పుడు మనం లోకులకు జడవాలా?

సుశీల:—నువ్వు జడవనవసరంలేదు. నేనో! ఆడది ఉద్యోగంచేయడమే పెద్ద తప్పుగా పరిగణిస్తున్న యీ ఊళ్లో మన యిద్దర్నిచూసి నలుగురూ ఊరుకుంటారా? మోహన్ మనం బంధువులమే కాని...

మోహన్:—కాని? ... నేను రావడంగాని; నీతో మాట్లాడడంగాని నీకు యిష్టంలేదు, అంతేనా? ... నువ్వు ఏమన్నాసరే నేను నిన్ను చూడకుండా ఉండలేను సుశీలా!

సుశీల:—(వ్యంగ్యంగా) ఔను ఉండలేవు! దొంగతనంచేయకుండా ఉండలేవు! ఏం... మోహన్ ఎందుకీ బ్రతుకు?

మోహన్:—నిజమే! ఎందుకీ బ్రతుకు? నువ్వు తిరస్కరిస్తే యీ బ్రతుకు వ్యర్థమే!...నీమీద ఆశకొద్దీ చావలేకుండా ఉన్నాను. నువ్వు ఏం చేయమంటే అది చేస్తాను గాని నన్ను తిరస్కరించకు. నన్ను వివాహమాడతానన్న మాట మరిచిపోకు... ఆ మాటలన్నీ మరచిపోయావా?

సుశీల:—నేను ఏవీ మరచిపోలేదు. నీవు నీ కుటుంబగౌరవం మరచి పోయావ్. నీవు నీ ప్రవర్తన మార్చుకుంటేగాని నా వాగ్దానము నేను నిలబెట్టుకోలేను.

మోహన్:—నన్ను ఏం చేయమంటావ్? ఎలా బ్రతకను?...

సుశీల:-ప్రస్తుతం నీదీ ఒకబ్రతుకే! నీ బ్రతుకు తెరువు మార్చుకో. ఏదైనా ఉద్యోగం చెయ్యి మర్యాదగా బ్రతుకు.

మోహన్:-నీ Promise

సుశీల:-అదంతా తర్వాత. ఎప్పటికైనా నీలో పరివర్తన కలిగి మర్యాదగా జీవిస్తావని ఆశపెట్టుకున్నాను. అంతేగాని నా Promiseను నేను మరచిపోలేదు.

మోహన్:—నిజంగానా! మరచిపోలేదా?

సుశీల:-నీవంటే నీ చదువు, నీ విజ్ఞానం, నీనీతి, నీ కుటుంబగౌరవం, అన్నీ మరచి పాడయావు... చిన్నప్పుడు నేను నాన్న జేబులోనుండి ఒక అణా దొంగలాడేనని కోప్పడ్డ నీవు యిప్పుడేం చేస్తున్నావు? క్లాసులో తోటికుఱ్ఱవాడి పెన్సిల్ అన్నయ్యతీశాడని నాన్నతో ఫిర్యాదు చేసిన పెద్దమనిషివేనా నీవు? చిన్నప్పటి నీ సత్ప్రవర్తనలో లవలేశమైనా యిప్పుడు నీకుందీ?

మోహన్:—సుశీలా! నన్ను ఎందుకు ఊరకే ఎత్తిపొడుస్తావు?

సుశీల:-చిన్నప్పుడు నీవు ఎంతనీతితో ప్రవర్తించావో, ఎంత మంచివాడివనిపించుకున్నావో, ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకో. నీ పూర్వ చరిత్రను ఒక్కసారి మననంచేసుకో. ఒక్కసారి నీ ప్రస్తుత జీవితాన్ని నీ పూర్వపు దినాలతో పోల్చి చూసుకో. నీ బ్రతుకు నీకే అర్థమవుతుంది.

మోహన్:-సుశీల! ఇంక నన్ను బాధ పెట్టకు. నేను-

సుశీల:-అయితే వెళ్లు, నీ వృత్తి మార్చుకో! మర్యాదగా జీవించు. B. A. వరకు చదివిన నీ చదువును ఏంచేశావ్? ఎందుకు నీకు యీ పాడు దొంగవృత్తి?

మోహన్:-[సిగ్గుతో]మామనన్ను పోషించలేక నన్ను వేరు పొమ్మన్నాడు. ఉద్యోగం దొరక్క-కడుపు కక్కుర్తికోసం మొదలు పెట్టాను ధన మార్జించడానికి దగ్గిర మార్గమని—దీన్ని వదిలిపెట్టలేకుండా ఉన్నాను.

సుశీల:-అయితే ఉచ్చమూ నీచమూ అంటూ లేదన్న మాట - ఒక్కసారి పట్టుబడి జైలుకు వెళితే నీ జీవితం ఏమవుతుందో గ్రహించావా? అప్పుడు నీ మొహం ఎవరికి చూపించగలవ్?

మోహన్:-ఔను; నా బ్రతుకు నిందలపాలవుతుంది. నన్ను చూసి అందరూ అసహ్యించుకుంటారు. కాని...

సుశీల:-ఇంకా ఆ కానీ ఏమిటి? నిన్నింకా ఆ పిశాచం వదలడం లేదా? నీ మొహం నాకు చూపించకు,... వెళ్లు... (పోబోతుంది)

మోహన్:-సుశీలా! ఆ పిశాచం నన్ను వదలడం కాదు. నేనే ఆ పిశాచాన్నీ వదలదలచుకున్నాను. కాని నాకు ఉద్యోగం ఎవరిస్తారు యిప్పుడు? నా జీవితం ఎలా గడుస్తుంది యిప్పుడు?

సుశీల: నీలో పరివర్తనం కలిగితే చాలు ఉద్యోగం దొరక్కపోతుందా! ఇక్కడ కాకపోతే ఇంకో చోట దొరుకుతుంది. నీకు ఉద్యోగం దొరకే వరకు నేను సహాయం చేస్తాను.

మోహన్:-నిజంగానా?

సుశీల:-నిజమే కాని నీవు పూర్తిగా మారాలి.

మోహన్:-మార్తాను. నిజంగా మార్తాను.—పూర్తిగా మార్తాను. ఇకమీదట దొంగతనంచేయను; మర్యాదగా జీవిస్తాను. నా మాట నమ్ము.

సుశీల:-నీ మాటలు నమ్మవచ్చా!

మోహన్:-ప్రమాణం చేసిచెప్తాను-చెయ్యమన్నావా?

సుశీల:-దొంగ ప్రమాణం చేస్తే చాలదు మనస్ఫూర్తిగా చేసి ఆ చేసిన ప్రమాణం నిలబెట్టుకోవాలి.

మోహన్:-సుశీలా నన్ను యింకా అనుమానిస్తు

న్నావా? నీకోసమని ఏం చేయమంటే అది చేస్తాను. చేసిన ప్రమాణం తప్పకుండా నిలబెట్టుకుంటాను.

సుశీల:-అది తప్పితే?

మోహన్:-తప్పను. ఏ ప్రమాణం చేయమంటే అది చేస్తాను.

సుశీల:-ఐతే నేను చెప్పినట్లూ చెయ్యి.

మోహన్:-అలాగే

సుశీల:-"ఈ క్షణంనుండి అబద్ధమాడను, దొంగతనం చేయను, మర్యాదగా జీవిస్తాను. ఇందుకు విరుద్ధంగాపోతే నాకు అతిప్రియమైనది లేకుండా పోగాక!" అని ప్రమాణం చెయ్యి.

[ఒట్టుపెట్టమని చెయ్యి చూపుతుంది.]

మోహన్:-ప్రపంచంలోకల్లా నీవే నాకు ప్రియమైన దానివి నీమీద నా ప్రమాణం?

సుశీల:-ఎవరిమీద చేస్తేనేం? నీవు చేసే ప్రమాణం తప్పదలచుకున్నావా?

మోహన్:-తప్పదలచుకోలేదు. కాని నీ మీద ఎందుకు? నేను పొరపాటుచేస్తే నీకెందుకు హానికలగాలి?

సుశీల:-ఎక్కువ ప్రియమైన దానిమీద ప్రమాణం చేస్తే నిలబెట్టుకోడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. శ్రద్ధ ఉంటుంది. కనుక యీ ప్రమాణంచేసితీరాలి. తప్పదు.

మోహన్:-తప్పదా?

సుశీల:-తప్పదు! (మాధవరావుప్రవేశం)

మోహన్:-[కోర్టులోనిలబడినట్లు నిలబడి]"ఈక్షణం నుండి అబద్ధమాడను. దొంగతనం చేయను. మర్యాదగా జీవిస్తాను. ఇందుకు విరుద్ధంగాపోతే నాకు అతిప్రియమైనది లేకుండా పోగాక!"

మాధవ:-తథాస్తు త్వరలో ఉద్యోగస్తుడవై హాయిగా ఉండు నాయనా! నా కంతకన్నా ఏంకావాలి?

మోహన్:-మామయ్యా! సుశీల యివాళ నాకళ్లు విప్పింది.

సుశీల:-కాదండీ! మోహన్ యివాళ కళ్లు తెరచాడు. అతనిలో పరివర్తన కలిగింది.

మాధవ:-నీకు అతి ప్రియమైనది ఏది మోహన్?

మోహన్:-ఇదిగో [సుశీలను చూపిస్తాడు]

మాధవ:-[చిరునవ్వు నవ్వి] ఔనా సుశీలా?

సుశీల:-అని అంటున్నాడు మోహన్ నాకేం తెలుసు?

మాధవ:-[నవ్వుతూ] నీకు తెలియదా? పెళ్లిచేసుకోడానికి నిశ్చయించుకున్నారన్నమాట!

సుశీల:-ఔను; అతనిలో పరివర్తన కలిగింది, కాని యిప్పుడుకాదు. అతను ఉద్యోగస్థుడైన తర్వాత ...మీతో చెప్పకుండా నేను నిశ్చయించుకున్నందుకు క్షమించండి.

మాధవ:-నీ వివాహం నీ యిష్టమని ఎప్పుడో చెప్పాను. మోహన్! చాలా సంతోషం. ఉద్యోగ ప్రయత్నం చెయ్యి నాయనా! [వెళ్తాడు]

మోహన్:-అలాగే మామయ్యా! [అంటూ సుశీలను పట్టుకోబోతాడు]

సుశీలా: [తప్పించుకుని]

ఇదా యిదా నీ బ్రతుకు-నీ డిగ్రీ వృథాగా? ||ఇదా||
చదువు దండుగా? సిగ్గేలేదా? బుద్ధేరాదా? ||ఇదా||
సూట్ బూట్ వేషాలా మోసాలు చేయా?
మాటల డాబులలో - మాయలు చేసే
చదివిన నీ చదువు ఏమైపోయే?
నీ బుద్ధే గడ్డి తిన పోయేనా? ||ఇదా||

(659-వ పేజీ చూడుడు)

(648_వ పేజి తరువాయి)

బ్రతుకు కడుహీన మవగరాదోయి
ఊరు ఊరంతా నీ మాటలేనోయి.
వింత వింత కథలు ఎన్నో అల్లేరోయి.
బావమారవోయి ! చాల మంచిదోయి ||ఇదా||

మోహన్:-మారేనుగా !

సుశీలా:-చాలా మంచిదోయ్ ! (నవ్వుతుంది)

మోహన్:_[పట్టుకోబోతాడు.]

సుశీల:_(తప్పించుకుని) ఆగు. ఇదేనా మర్యాద ?

మోహన్:_ఏం ?

సుశీల:_పరాయిదాన్ని ముట్టుకోవచ్చునా ?

మోహన్:_నువ్వు నా దానివేగా ?


సుశీల:_నీకు ఉద్యోగం అవాలి తర్వాత మనిద్దరం వివాహం చేసుకోవాలి అంతవరకు నీ దాన్ని కానని తెలుసుకో.

మోహన్:_అంతవరకు నీ అధీనంలో నన్నొక సేవకుడుగా ఉంచుతావు కాబోలు !

సుశీల:_కాదు స్నేహితుడుగా.

(తెర)

(సశేషము)







అన్ని మందుల షాపులలోను లభించును

# ప్రేయసి వద్దకు ప్రయాణం

శ్రీ గిడుగు వేంకటరామమూర్తి

(గతసంచిక తరువాయి)

2—వ రంగం

[అదే యిల్లు - నాలుగు నెలలు గడచిన తర్వాత - కృష్ణమూర్తి ఒంటరిగా ఉండడం వల్ల, ఏమితోచక భర్తృహరి సుభాషితం చదువుతూ కూర్చుని ఉంటాడు. గదిలో సామాన్లు మునుపటి మాదిరిగానే అమర్చబడి ఉంటాయి. జూన్ 8వ తేదీ సాయంత్రం 4 గం సమయం]

కృష్ణ:—"హర్తకుగాదు గోచర మహర్నిశముల్ సుఖ పుష్టిజేయు స
త్కీర్తి ఘటించు విద్యయను దివ్యధనం బఖి లార్థి కోటికిన్
బూర్తిగ నిచ్చెనం బెరుగబోదు యుగాంత ప్రవేశమైన భూ
భర్తలు తీద్దనాధికుల పట్టున గర్వము మాను టొప్పగున్"

"భూషలుగావు మర్త్యులకు భూరిమయాంగద..."

రమేష్:—[ప్రవేశిస్తూ] ఏమిటిరోయ్ భర్తృహరి సుభాషితం చదువుతున్నావు?

కృష్ణ:—బి. ఎస్‌సి. వరకు వెలగబెట్టాంగదా? విద్యవలనమనకు కలిగే లాభాలు ఏమున్నాయని కవి చెప్పాడోచూద్దామని బుద్ధిపుట్టి చదువుతున్నాను— రారా కూర్చో.

రమేష్:—రామాయణం, భారతం, భాగవతమైనా తీసి చదువు పుణ్యామైనావస్తుంది. [కూర్చుని, సిగరెట్టు వెలిగించి] నువ్వు వచ్చి మూడురోజులయిందిట! మమ్మల్ని మరచిపోయావా?

కృష్ణ:—ఇంకా చిన్ననాటి స్నేహితుల్ని మరచిపోయేటంతటి పెద్దవాడ్ని కాలేదు.

రమేష్:—ఏమోలే! గ్రాడ్యుయేట్ వవుతున్నావు గదూ?

కృష్ణ:—ఏం గ్రాడ్యుయేట్ నయితే కొమ్ములొస్తాయా? నిరుద్యోగుల లిస్టులో అంటే Employment exchange వారి లిస్టులో మన పేరుకూడా చేరుతుంది. గురుసాగిరీలకు తయారయే మానవ యంత్రాలలో నేనొకడిని. అంతే యింకేముంది? ...మీరు సిరిగలవారు, కాపిటలిస్టులు కనుక మీరు మమల్ని మరచిపోయే అవకాశాలు ఉన్నాయి—ఏమంటావ్?

రమేష్:—ఒరేయ్! ఎంతయినా ప్రాణస్నేహితుల్ని మరచిపోతామా?

కృష్ణ:—ఒక కవి చెప్పాడులే—

"ఉద్యోగరహితు నలసుని
సుద్యత్సాహస విహీను నొల్లదుసిరి సం
పద్యోగు గొల్వకేరదు
చోద్యముగా వృద్ధ తరుణి చూడని భంగిన్"

అలాగ సిరిగల తరుణుల వంటి మీరు, వృద్ధుల వంటి యీ బీదలను........

రమేష్:— ఆపరా! పద్యం చాలా బాగుందిలే... సరేగాని నీ నెక్స్టు (next programme) ప్రోగ్రాం ఏమిటి?

కృష్ణ:—Daily papers తిరగవేస్తూ ఉండడం, వీలయిన చోటికల్లా application పడేస్తూ ఉండడం, కాళ్లు అరిగేవరకు తిరుగుతూ ఉండడం!

రమేష్:—మరి వేరే ఏం లేదా?

కృష్ణ:—ఆకలి వేసినప్పుడు యింత మేస్తూ ఉండడం!

రమేష్:—ఒరేయ్, నీకు సీరియస్ నెస్ లేదురా.

కృష్ణ:—ఏం?

రమేష్:—Higher studies గురించి ఆలోచన ఏమీ లేదా అని అడుగుతున్నాను.

కృష్ణ:—ఈ B. Sc. పూర్తిచేసేసరికి యజ్ఞం చేసినంత అయింది. వీలుంటే వచ్చేజన్మలోHigher studies గురించి ఆలోచిద్దాం.

రమేష్:—ఒరే, మాలాంటి వాళ్లకు డబ్బున్నా ప్రయోజనంలేదు. మా Brains కు చదువు ఎక్కదు. మీవంటి తెలివైన వాళ్లయినా చదవకపోతే ఎందుకురా?

కృష్ణ:—మీ Brains ఖాళీ అయితే మా Pockets ఖాళీ—ఏం చదువమంటావు?

రమేష్:—ఇప్పుడు చదివి పేసవుతున్న వాళ్లంతా నీకన్నా గొప్పవాళ్లా? ఏదైనా ప్రయత్నించాలి కాని...

కృష్ణ:—ఎవరైనా వెనుక దన్నుంటే సరి. డబ్బు సహాయం చేసేవాడేనా ఉండాలి, లేకపోతే రికమెండు చేసేవాడేనా ఉండాలి. మనకెవరున్నారు?

రమేష్:—నేను ఉన్నాను గదరా నీకు! నీ యిష్టం వచ్చిన కోర్సుచదువు, ఎంత కావాలంటే అంత యిస్తాను.

కృష్ణ:—Thank you! నా విషయంలో అదొకటేనా! నేను చదువుతూ కూర్చుంటే యింటి సంగతి! మా నాన్న అప్పుడే ముసలివాడయాడా! ఇంకా ఎన్నాళ్లు కష్టపడగలడు. మా సుశీల పెళ్లికాకుండా ఎన్నాళ్లుంటుంది? తర్వాత భుక్తి!

రమేష్:—అదంతా నేను చూస్తానుగదరా! ... ఇది వరకే మీనాన్నతో చెప్పాను. కాని ఆయన అంత పట్టించుకున్నట్లులేదు.

కృష్ణ:—ఏం చెప్పావ్? ఈ విషయం మా నాన్న నాతో ఏం చెప్పలేదే!

రమేష్:—నీ చదువుకు కావలసిన సహాయం చేస్తానని, నీకు మంచి ఉద్యోగం దొరికేవరకు నా వద్దనే ఆయన ఉండవచ్చుననీ; మీ సుశీల పెళ్లికి కావలసిన సహాయం, ఏర్పాట్లు చేస్తానని చెప్పాను.

కృష్ణ:—సుశీల పెళ్లి దాని యిష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంది. దాని పెళ్లయితేగాని మానాన్న దాన్ని వదలి పెట్టి ఉండడు.

రమేష్:—దాని యిష్టమేమిట్రా? పెద్దవాళ్లు తగిన సంబంధంచూసి చెయ్యాలిగాని?

కృష్ణ:—ఏదో యింతో అంతో S. S. L. C. వరకు చదువుకుందా? ఉద్యోగం చేస్తుందా! దాని మంచీ చెడ్డా దానికి తెలియదంటావా?

రమేష్:—దానికన్నా పెద్దవాడవూ నీ మంచీ చెడ్డా నీకే తెలియదే! చిన్నది దానికేం తెలుసు? అయినా, యితర విషయాలుకూడా ఆలోచించాలా! నీ future!

కృష్ణ:—నా future కోసం దాని స్వాతంత్ర్యాన్ని బలిపెట్టమంటావా? నాకిష్టంలేదు.

రమేష్:—నీకూ ఎక్కిందీ యీ స్త్రీ స్వాతంత్ర్య తత్వం!

కృష్ణ:—అంత తెలియని అమాయకులయితే, పెద్దలు జోక్యం కలుగజేసుకుని మంచీ చెడ్డాచెప్పి ఒప్పించ

వచ్చును. మా సుశీలకు ఆ మాత్రం జ్ఞానం ఉందని నా నమ్మకం.

రమేష్:—అంత తెలిసినదయితే ... ఆ మోహన్ గాడితో ఎందుకు తిరుగుతుంది? వాడిని పెళ్లి చేసుకోడానికి ఎందుకు నిశ్చయించుకుంటుంది?

కృష్ణ:—ఏమిటి? మోహన్ను చేసుకుంటుందా? ఇది నాకు ఒక కొత్త వార్త!

రమేష్:—నీ యింటి విషయం నీకు తెలియకపోవడం ఆశ్చర్యమే. ... వాడినుంచేగదా మీ నాన్న అప్పులపాలయ్యేడు. వాడికేమయినా విశ్వాసం ఉందీ? వాడు యీ ఊళ్లో ఉన్నంతకాలం మీ నాన్న మొహం ఎత్తుకు తిరుగలేకపోయాడనుకో! ... ఆ శనీశ్వరుడు మిమ్మల్ని వదిలి పోతానన్నా మీరు వదలకుండా పట్టుకోండి.

కృష్ణ:—ఈ విషయంలో నేనేం చెప్పలేనురా. సుశీల మరి ఎలా ఒప్పుకుందో! ఆ మధ్య నాన్న నాకు ఉత్తరం వ్రాసినప్పుడు యీ విషయాలేమీ వ్రాయలేదు. కాని వాడిప్పుడు బుద్ధిమంతుడయ్యాడని, మర్యాదగా ప్రవర్తిస్తూ విజయపురంలో ఉద్యోగం చేస్తున్నాడనీ వ్రాశాడు.

రమేష్:—వాడిబుద్ధి, వాడి ప్రవర్తనా అడగనక్కరలేదు. ఒరే ఎంతయినా దొంగ దొంగేరా! ఒరే ఒక్క సంగతి; వాడికి ఉద్యోగం దొరకిన తర్వాత మీ నాన్నకు ఎన్ని ఉత్తరాలు వ్రాశాడో కనుక్కో; ఎంత ధనసహాయం చేశాడో కనుక్కో; అసలు వాడు మీ ధనసహాయం అపేక్షించాడుగాని, మీకు సహాయం చేయాలని వాడికి ఉంటేగదూ?

కృష:—అసలు యీ గొడవలు నాకేం తెలియవు. నా కంతా అయోమయంగా ఉంది.

రమేష్:—ఔను; నిన్ను ఆ పరిస్థితిలో ఉంచారు మీ వాళ్లు ... ఇంతకీ వాడక్కడ యింకో పిల్లని పెళ్ళిచేసుకోబోతున్నాడు. మరో పదిరోజుల్లో పెళ్ళికాబోతోంది. తండ్రి వంటివాడుగదా మీ నాన్న, ఆయనకేనా యీ సంగతి వ్రాశాడేమో కనుక్కో!

కృష్ణ:—ఈ సంగతి నీ కెవరు చెప్పారు?

రమేష్:—[ఉత్తరం జేబులోనుంచితీసి] ఇదిగో చూడు, పెళ్ళికూతురు తండ్రి నాకు దూరపు బంధువులే, ఆయన నాకు ఉత్తరం వ్రాశాడు. వీడ్ని గురించి వివరాలు అడుగుతున్నా. పీటలమీద పెళ్లి తప్పించడం యిష్టంలేక చాలా మంచివాడని జవాబువ్రాసి పారేశాను. [సుశీల ప్రవేశించి, రమేష్‌వైపుచూసి యింట్లోకి వెళ్ళబోతుంది, రమేష్ సుశీలనుచూసి, పనిఉన్నవాడిలాలేచి] వస్తారా మళ్ళీ, [పోబోతాడు.]

కృష్ణ:—ఉత్తరం యిండ.

రమేష్:—చింపిపారేద్దూ; నా కెందుకూ ఆ ఉత్తరం? వస్తా [అంటూ వెళ్ళిపోతాడు. సుశీల అటువైపు తీక్షణంగా చూస్తుంది.]

సుశీల:—ఏమిటన్నయ్యా ఆ ఉత్తరం?

కృష్ణ:—ఏం లేదూ?—

సుశీల:—రమేష్ ఎందుకు వచ్చాడు?

కృష్ణ:—నన్ను చూసి పోవడానికి! [ఆలోచిస్తూ అంటాడు.]

సుశీల:—ఏమిటలా ఆలోచిస్తున్నావు?

కృష్ణ:—ఆడదానివి నువ్వు ఆఫీసుకు వెళ్ళివస్తూ ఉంటే, మొగాడ్ని నేనింట్లో పనిలేకుండా కూర్చున్నాను గదా అని!

సుశీల:—ఇంకా డిగ్రీ చేతికిరాలేదు; రిజల్ట్సుకూడ యింకా తెలియలేదు; అప్పుడే దిగులా?

కృష్ణ:—దిగులుకాదు; తొందర!

సుశీల:—ఏదో కప్పిపుచ్చాలని మాట్లాడుతున్నావుగాని ... ఏమిటా ఉత్తరం? ఇలా యియ్యి.

కృష్ణ:—నీకు సంబంధించిందికాదు. [జేబులో పెడతాడు.]

సుశీల:_అయితే నీ దగ్గరే ఉంచుకో. ఆ రమేష్ ఎప్పుడువచ్చినా ఏదో కలత కలుగజేస్తేగాని బయటకుపోడు. ... మన మోహన్ అంటే యితనికి కిట్టదు. [పోబోతుంది.]

కృష్ణ:_సుశీలా! మోహన్ అంటే జ్ఞాపకం వచ్చింది. వాడెలా ఉన్నాడు యిప్పుడు?

సుశీల:_[ఆగి] ఏం? బాగానే ఉండి ఉంటాడు.

కృష్ణ:_అంటే వాడి దగ్గరనుండి ఉత్తరాలులేవా యిప్పుడు?

సుశీల:_మాట్లాడితేనే తప్పుగా భావించే యీ లోకం ఉత్తరాలువ్రాస్తే ఊరుకుంటుందా?

కృష్ణ:_నీకు వ్రాయకపోవచ్చును; కాని నాన్నగారి పేర వ్రాయవచ్చునుగదా?

సుశీల:_మొదట్లో వ్రాశాడుకాని రెండునెలలయి వ్రాయడంలేదు.

కృష్ణ:_కారణం? [మాధవరావు ప్రవేశిస్తాడు.]

సుశీల:_తెలీదు.

మాధవ:_ఎవరు?

కృష్ణ:_మన మోహన్.

మాధ:_ఏమో తీరికలేదేమో! చదువుకునే కుర్రాడివి నువ్వు మహా తరచు వ్రాశావ్?

సుశీల:_పోనీ నువ్వు అతనికి ఉత్తరంవ్రాసి కనుక్కో అన్నయ్యా [అంటూ వెళ్తుంది. మాధవరావు, కండువా తీసి, కుర్చీమీద కూర్చుంటాడు.]

కృష్ణ:_ఏమండీ నాన్నగారూ! సుశీల మోహన్ను పెళ్ళిచేసుకుంటుందా?

మాధ:_ఔను; ఏం?

కృష్ణ:_ఇంతకన్నా మంచి సంబంధం దొరకదనా?

మాధ:_దానికి నచ్చినవాడిని అది చేసుకుంటుంది. నీ యిష్టం వచ్చిన పిల్లని నువ్వు చేసుకోవచ్చునని ఎలా చెప్పేనో అలాగే దానికీ చెప్పాను.

కృష్ణ:_అయితే మంచీ, చెడ్డా మనం ఆలోచించక్కర లేదా?

మాధ:_ఆలోచించాలి; ఆలోచించాను. దానికి యిష్టమయినవాడినిచూసి, నేను అంగీకరించిన తర్వాతనే, అది నిశ్చయించుకుంది.

కృష్ణ:_మీరు యీ సంబంధం అంగీకరించడం నాకేం నచ్చలేదు.

మాధవ:_ఏం? వాడికేం తక్కువయింది? వాడిప్పుడు బుద్ధిమంతుడు! సుశీల వాడిని చేసుకోడం నాకు సమ్మతమే.

కృష్ణ:_వాడికి నిలకడే తక్కువయింది!

మాధవ:_అంటే?

కృష్ణ:_సుశీలను చేసుకుంటానని ఒప్పుకున్నాడా?

మాధ:_ఒప్పుకున్నాడు.

కృష్ణ:_అలాంటివాడు, యింకో సంబంధం ఎలా ఒప్పుకున్నాడు?

మాధవ:-ఎవరి సంబంధం?

కృష్ణ:_ఈ ఉత్తరం మాడండి. [యిస్తాడు.]

మాధవ:_[చదివి] నిజమేనంటావా?

కృష్ణ:_నిజంకాకపోతే మరేమిటి? వాడికి కట్నంతో పిల్లవస్తోంది. మీరేం యివ్వగలరు? అవసరం తీరేవరకు మన యింట్లో మేశాడు. సుశీలను చెరచాలనుకున్నాడు. ఈ అమాయకపుపిల్ల ఆ దొంగ వెధవని నమ్మింది. నయం! దీన్ని గోతిలో దించలేదు.

మాధవ:_వాడి దగ్గరనుండి ఉత్తరంవస్తేగాని నేను నమ్మలేనురా!

కృష్ణ:_ఔను; మీరు దొంగల్ని నమ్ముతారు గాని యితరుల్ని నమ్మరు; మీరెలా నమ్ముతారు. అమ్మాయి నట్టేటిలో మునిగి ఉంటే నమ్మి ఉందురు. [సుశీలవస్తుంది] స్త్రీలకు స్వేచ్ఛ! స్వయంవరం! దొంగకి దొంగబుద్ధులు కాకపోతే

మంచి బుద్ధులెలావస్తాయి? మీరింకా వాడిని నమ్ముతూ కూర్చోండి.

సుశీల:—మోహన్ను గురించేనా నీ లెక్చరంతా? దొంగ ఎప్పుడూ దొంగేనా? వాళ్ళల్లో పరివర్తనం ఉండదా? ... పైకి బాబుగా ఉండి లోన కుట్రలు పన్నేవాళ్ళంతా నీకు మంచివాళ్ళు, నిజాయితీ గలవాళ్లూను; ఆ రమేష్‌వచ్చి నీకేదో నూరిపోశాడు ... నా విషయంలో నువ్వు జోక్యం కలుగజేసుకోకు.

కృష్ణ:—నాకు అనవసరమే! కాని ఆ ఉత్తరం చదువుకో నీ మోహన్ ఎంతటివాడో నీకే తెలుస్తుంది. ...ఇవ్వండి [తండ్రి చేతిలోని ఉత్తరం తీసుకుని చెల్లెలు చేతికిస్తాడు] చదువుకుని దాని భావి జీవితం అది నిర్ణయించుకుంటుంది. [సుశీల ఉత్తరం చదివి యిటూఅటూ తిప్పి చూస్తుంది. మాట్లాడలేక పోతుంది. కళ్లు చెమ్మగిల్లుతాయి. మొహం వివర్ణమౌతుంది.]

మాధవ:—ఏమోరా! సంబంధం ఉందికదా అని వాళ్లు వీడికి పిల్లని చూపించి ఉంటారు.

కృష్ణ:—అదొకటా? వాడొప్పుకున్నట్టు, ముహూర్తం నిశ్చయమైనట్టు ఉంది చదవండి. ... అది సరే, గాని, వాడిప్పుడు ఎందువల్ల ఉత్తరాలు వ్రాయడం మానుకున్నాడు? ఇదంతా ఏమిటి?

మాధవ:—నాతో చెప్పకుండా ఎలా ఒప్పుకున్నాడు! ఆ సంబంధం జరుగనివ్వను.

కృష్ణ:—ఇంతకు మనం అదృష్టవంతులమని సంతోషించాలి. ఇంతనిలకడలేని వీడి సంబంధం తప్పిపోవడమే మంచిదయింది. వాడు ఎలా ఏడిస్తే మనకేం? ఆ సంబంధం మనం బలవంతాన ఆపి అలాంటి దొంగ వెధవకి యిచ్చి పెళ్ళి చేస్తే యిదేం సుఖపడుతుంది. మన జాగ్రత్తలో మనం ఉండడం మంచిది. వాడి విషయం యిక తలపెట్టకండి...తండ్రివంటివారుకదా మీరు మీకు ఒక్క ఉత్తరం యీ విషయం వ్రాశాడా! వాడికి మీయందు విశ్వాసం ఉందీ! తర్వాత మీ యిష్టం, దాని యిష్టం [వెళ్తాడు]

సుశీల:—[అతి కష్టంగా] నాన్నగారూ నిజమేనంటారా?

మాధవ:—ఏమో? ఏం చెప్పను? మన కృష్ణకు యిది వరకొకసారి యీ సంబంధం వచ్చింది. ఈ సంబంధం యీ మనుష్యులు ఉన్నారని నాకు తెలుసు కాని ...

సుశీల:—అయితే నిజమేనేమో?

మాధవ:—నువ్వు ఉట్టినే బెంగపెట్టుకోకు! కనుక్కొనిదే నేనేం చెప్పను. వాడిని రమ్మని యివాళ ఉత్తరం వ్రాస్తాను. ముఖాముఖీని అన్నీ తేల్చుకుందాం.

సుశీల:—మీరేం వ్రాయవద్దు. అతనికి ఏ పిల్లనచ్చితే ఆ పిల్లనే చేసుకోనీయండి. మీ రెవరూ, నే నెవరూ కాదనడానికి? అతడు మర్యాదగా జీవిస్తే అదే నాకు పదివేలు.

మాధవ:—సరే [వెళ్తాడు]

సుశీల:—నన్ను నమ్మించి మోసం చేశాడు. ఆడి తప్పాడు ... ఈ కాలంలో ప్రమాణానికి విలువ ఉందా? ... మోహన్! నన్ను నమ్మించి మోసం చేశావా? ప్రపంచంలో నేనే ప్రియమైనదానివన్నావు? అదంతా బూటకమేనా? నా ఆశలన్నీ నిరాశలేనా? నన్ను నమ్మించి మోసం చేశావా? అమ్మా! అమ్మా! నాగతి యింతేనా! అమ్మా! [పడి పోతుంది.]

తెర

(సశేషము)

# ప్రేయసి వద్దకు ★ ★ ప్రయాణం

శ్రీ గిడుగు వెంకటరామమూర్తి

(గతసంచిక తరువాయి)

3-వ రంగం

[అదే గది. జూన్ 10-వ తేదీ రాత్రి 9 గంటల సమయం - సుశీల లోపున (నేపథ్యంలో) జబ్బుతో తెలివితప్పి ఉంటుంది. ఒకటి రెండు సార్లు "మోహన్ నన్ను మోసంచేశావా ?" అని పలవరిస్తుంది. గదిలో టేబిల్ మీద మందు సీసా వగైరా ఉంటాయి. కృష్ణమూర్తి రోగిని కనిపెట్టుకుని ఉంటాడు. ఒకసారి మందుయిచ్చినట్టు వెళ్ళివచ్చి, తోచక యిటూ అటూ తిరుగుతూ ఉంటాడు. మాధవరావు అలసి పోయి రొజుకుంటూ వస్తాడు.]

మాధవ:-[వస్తూ] కృష్ణా ! సెలవు యివ్వనన్నాడు, మా మేనేజరు. ఇవాళ చాలా అర్జెంటుపని ఉందిట ! ఈ రాత్రి తప్పకుండా పనిచేసి తీరాలన్నాడు. ఈ నైట్ డ్యూటీ ఒకటి వచ్చిపడింది. వెళ్ళక తప్పదు. ... సుశీల యీ స్థితిలో ఉంటే ఎలా వదలివెళ్ళను రా !

కృష్ణ:-మీరుండి చేసేదేముంది ? నేను ఉన్నానుగదా ? ఫరవాలేదు మీరు వెళ్ళండి. ... త్రోవలో డాక్టర్ గోపాల్ గార్ని కలసి ఆయన్ను యిక్కడకి పంపించి మరీ వెళ్ళండి.

మాధవ:-జాగ్రత్త నాయనా ! అవసరమైతే ఎవరి చేతనైనా కబురుపంపు.

కృష్ణ:-అలాగే; వెళ్లండి; డాక్టరుతో చెప్పి మరీ వెళ్లండి.

మాధవ:-జాగ్రత్త నాయనా !

కృష్ణ:-అలాగే ! వీలయినంత త్వరలో మీరూ వచ్చేయండి.

మాధ:-అలాగే; జాగ్రత్త,-వస్తాను. [మాధవరావు వెళ్ళిన కొలది కాలమయిన తర్వాత డాక్టర్ గోపాల్ వస్తాడు.]

గోపాల్:-[వస్తూ] ఏం కృష్ణా ఎలాగుంది ?

కృష్ణ:-వచ్చేరా - అలాగే ఉంది. తెలివిరాలేదు. మీరు చూడండి. [రోగిని పరీక్షచేయడానికని లోపుకు వెళ్ళి వస్తాడు.]

గోపాల్:-మీ నాన్నగారెక్కడ ?

కృష్ణ:-మీ దగ్గరకురాలేదూ ? ఇప్పుడే వెళ్ళారు.

గోపాల్:-నేను యింట్లోలేను ; వేరే కేసుమీద సాయంత్రం వెళ్ళి యిప్పుడే వస్తున్నాను. ఆయన ఎక్కడికి వెళ్ళారు ?

కృష్ణ:—నైట్ డ్యూటీ ఉంటే వెళ్ళారు.

గోపాల్:—పేషంట్ యీ కండిషన్‌లో ఉంటే ఎలా వెళ్ళారోయ్?

కృష్ణ:—ఏం చెయ్యమన్నారు? వెళ్ళక తప్పలేదు.... ఏం ఎలాగుంది?

గోపాల్:—ఇప్పటికి Pulse బాగానే ఉంది; గుండెపరిస్థితి కూడా బాగానే ఉంది కాని...

కృష్ణ:—డాక్టర్ గారూ చెప్పండి! మరేం భయం లేదుకదా? ప్రాణాపాయంలేదుకదా? ... చెప్పండి.

గోపాల్:—ఈ రాత్రికి ఏం ఫరవాలేదుగాని, ఎంతయినా సీరియస్ కండిషన్ అనే చెప్పాలి.

కృష్ణ:—డాక్టర్! రెండు రోజుల్లో యింత సీరియస్‌గా ఎలా మారింది? అసలు యింతకు జబ్బేమిటంటారు?

గోపాల్:—ఇదేదో మెంటల్ షాక్‌లా ఉంది. Brain effect అయిందోయ్! ... ప్రయత్నించి చూద్దాం ... నా లోపంలేకుండా ప్రయత్నిస్తాను. ... ఇప్పుడే ఒక్క యింజక్షను యిచ్చానుగదా? మళ్ళీ రాత్రి రెండు గంటలకు మరొకటి యిస్తాను.

కృష్ణ:—డాక్టర్! మీరు తప్పితే మాకు వేరే దిక్కు లేదు. మీ దగ్గరకు రావడానికికూడా నాకు ఎవరూ తోడులేరు. మీరు తప్పకుండా రెండు గంటలకు వస్తారుకదూ?

గోపాల్:—తప్పకుండా వస్తాను, వచ్చి తీరుతాను. అసలు ఈ రాత్రి నేను నిద్రపోవడానికి వీలుండదు. ఇక్కడకు దగ్గరగా 5 మైళ్ళ దూరంలో రామాపురం ఉంది. నీకు తెలుసుకదూ? అక్కడ మరొక పేషంట్‌కూడా చాలా సీరియస్‌గా ఉంది. ఇక్కడినుండి తిన్నగా అక్కడికే కార్లో వెళ్తున్నాను. మళ్ళీ కార్లో తిన్నగా యిక్కడికే వస్తాను.

కృష్ణ:—ఈ రాత్రంతా మీ రిక్కడే ఉండాలి.

గోపాల్:—అలాగే అక్కడినుండివచ్చి యిక్కడే ఉంటాను. మరేం ఫరవాలేదు; నువ్వు మాత్రం నిద్రపోకుండా చాలా జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండు. ... ఈ మందు ప్రతి రెండు గంటల కొకసారి యిస్తూ ఉండు. జాగ్రత్త! వస్తా.

[నేపథ్యంనుండి సుశీల "మోహన్ నన్ను మోసం చేశావా, ఆడి తప్పేవా" అని పలవరిస్తుంది.]

గోపాల్:—ఆ పలవరింతలు విన్నావా?

కృష్ణ:—మొన్నట్నుంచి యిలాగే ఉండుండి పలవరిస్తోంది.

గోపాల్:—'మోహన్' అంటూంది, ఎవరా మోహన్?

కృష్ణ:—మా బావ. మీకు తెలుసుననుకుంటాను.

గోపాల్:—అతనా! సుశీలకు తెలివివచ్చేసరికి, అతను యిక్కడ ఉంటే మంచిది. లేకపోతే మళ్ళీ తెలివి తప్పవచ్చు.

కృష్ణ:—వాడు యీ ఊర్లోలేడే! వాడు రావాలంటారా?

గోపాల్:—తప్పకుండాను,

కృష్ణ:—అయితే దయచేసి Express wire యిస్తారా రాసి యిస్తాను.

గోపాల్:—అలాగే.

[కృష్ణమూర్తి వ్రాసి యిస్తాడు. డాక్టర్ వెళ్తాడు. ప్రతి రెండు గంటలకు కృష్ణ మందిస్తాడు. రాత్రి గడుస్తుంది. గడియారం తిరుగుతూ ఉంటుంది. తెల్లవారి 5 గంటలు అవుతుంది ఆత్రుతతో మాధవరావు వస్తాడు.]

మాధవ:—[వస్తూ, ఆత్రుతతో] ఏం నాయనా ఎలాగుంది?

కృష్ణ:—అలాగే ఉంది.

మాధవ:—రాత్రి డాక్టర్ గారు వచ్చారా?

కృష్ణ:—రాత్రి మీరు వెళ్లగానే వచ్చి యింజక్షన్ యిచ్చి వెళ్ళారు. మళ్లీ రాత్రి రెండు గంటలకు వచ్చి మరొక యింజక్షన్ యిస్తానన్నారు. కాని యింతవరకు మళ్ళీరాలేదు. కారణం తెలీలేదు.

మాధవ:—త్రోవలో యిప్పుడు వాళ్ళింటికి వెళ్ళి వచ్చాను. రాత్రినుండి యింటికి రాలేదుట! ఇక్కడే ఉన్నారనుకున్నాను.

కృష్ణ:—ఆ గ్రామంనుండి రాలేకపోయారేమో! రాత్రి రామాపురం ఏదో అర్జంటు కేసుమీద వెళ్తున్నా నన్నాడు.

మాధవ:—ఇంకేం చెప్పాడు?

కృష్ణ:—ఇదేదో మెంటల్ షాక్‌లా ఉంది. తనలోపం లేకుండా ప్రయత్నిస్తానన్నాడు. రాత్రి కారులో ఆ గ్రామంనుండి తిన్నగా యిక్కడకే వచ్చి రాత్రంతా యిక్కడే ఉంటానన్నాడు.

మాధవ:—చాల మంచివాడురా! మన ఊళ్లోఉన్న డాక్టర్లలో యితనొక్కడే ఘనుడు. ... ఇంతకీ మన అదృష్టం ఎలా ఉందో! ... మొన్న రమేష్‌గాడు తెచ్చి యిచ్చిన ఉత్తరంవల్లనే యీ మెంటల్ షాక్ వచ్చి ఉంటుంది.

కృష్ణ:—రాత్రంతా ఒకటే పలవరింతలు.

మాధవ:—ఏమని?

కృష్ణ:—"మోహన్ నన్ను మోసం చేశావా? ఆడి తప్పేవా?" ఇలాగే ఏమేమో ఆ మోహన్ గురించే.

మాధవ:—మోహన్ వస్తే బాగుంటుంది. ఎలాగ?

కృష్ణ:—రాత్రి డాక్టర్‌గారు కూడా యిలాగే అంటే రాత్రి ఆయన చేతనే Express wire యిప్పించాను. వస్తే వాడు యీ పాటికి రావచ్చును.

మాధవ:—వాడెందుకొస్తాడు? దీనిమీద వాడికిప్పుడు దయ ఎందుకుంటుంది? దీన్ని మోసం చేసిన వాడు ఏమోహం పెట్టుకుని వస్తాడు. వెధవ! విశ్వాసహీనుడు! తుచ్ఛుడు! నా అన్నంతిని, నా కడుపులో చిచ్చు పెట్టాడు! ఇటువంటి విశ్వాస ఘాతకుడ్ని ఏం చేసినా పాపంలేదు.

కృష్ణ:—వాడిని ప్రేమించి, మోసపోయి, బెంగపెట్టుకుని యింతవరకు తెచ్చుకుంది, యీ అమాయకపు పిల్ల!

మాధవ:—ఇంతకూ వాడొకసారి వస్తే బాగుండును. వస్తాడంటావా?

కృష్ణ:—నాకు నమ్మకంలేదు ... (దుఃఖంతో) సుశీల బ్రతికే ఆశ నాకులేదండీ! రాత్రి వెళ్లిన డాక్టరు యింతవరకురాలేదు. అన్నీ మనకు ప్రతికూలంగా ఉన్నాయి. నాన్నగారూ! సుశీల బ్రతికే ఆశ నాకు లేదండీ!

మాధవ:—మనం ఏం చేయగలం? ఇంతకీ మన అదృష్టం ఎలా ఉందో! [వంటి నిండా దెబ్బలు తగిలినందువల్ల కట్లు కట్టిఉంటాయి. సుశీలా! సుశీలా! అంటూ మోహన్ వస్తాడు]

కృష్ణ:-(సంతోషంతో) మోహన్!

మాధవ:-(సంతోషంతో) మోహన్! నాయనా వచ్చావా! సుశీలను బ్రతికించడానికి వచ్చావా నాయనా! కృష్ణా! మోహన్ వచ్చాడు మన సుశీల తప్పకుండా బ్రతుకుతుంది. మోహన్ నీ గురించే కలవరిస్తోంది! వెళ్లు.

మోహన్:—ఏదీ నా సుశీల? ఎలాగుంది? ఏదీ?

మాధవ:—అదిగో! వెళ్లు; పలకరించు, "మోహన్ను వచ్చా"నని చెప్పు.

మోహన్:—[లోపలకు వెళ్ళి] - సుశీలా! నేను మోహన్ని-వచ్చాను. చూడు ... ఒక్క సారి చూడు. కోపం వచ్చిందా? సుశీలా నాతో మాట్లాడవ్?

నేపథ్యం:- సుశీల "మోహన్ నన్ను మోసం చేశావా? ఆడి తప్పేవా?"

మోహన్:—[వస్తూ] ఏమిటి మామా తెలివి లేదే! నన్ను గుర్తించలేదే! ఏమిటీ వ్యాధి? ఎన్నాళ్లయింది? నాకెందుకు ఉత్తరం వ్రాయలేదు? ... చెప్పు మామా?......ఒరే కృష్ణా! నువ్వైనా చెప్పరా! మాట్లాడరేం? ... ఏమిటి యిదంతా?

మాధవ:—నా ఖర్మం! దానికి మనోవ్యాధి Brain effect అయింది.

మోహన్:—కారణం?

కృష్ణ:—నువ్వే కారణం?

మోహన్:—నేనా!

కృష్ణ:—ఔను; నువ్వే!

మోహన్:—నే... నా!

కృష్ణ:—ఏమిటీ నాటకం! ఏమి తెలియనట్టు నటిస్తావేం! దాన్ని పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించావ్!

మోహన్:—నేనేం మోసగించలేదు. సుశీలను నేనెప్పుడు నిరాకరించలేదు.

కృష్ణ:—అలాంటి వాడివి ఆ సంబంధం ఎలా ఒప్పుకున్నావ్?

మోహన్:—ఏ సంబంధం? నాకంతా అయోమయంగా ఉంది.

కృష్ణ:—ఔను నీకు అంతా అయోమయమే! ఏమీ తెలియనట్టు నటించేవాడికి అంతా అయోమయమే! [ఉత్తరం తెచ్చి యిచ్చి] చూడు. ఈ ఉత్తరమేమిటి!

మోహన్:—[ఆశ్చర్యపడుతూ చదివి] ఇదంతా ఎవరిదో బనాయింపు! కుతంత్రం! మోసం! మామా నాకే పాపం తెలియదు...ఇదంతా మోసంమామా! నన్ను నమ్ము! నావల్ల యింకేదైనా తప్పుంటే శిక్షించు, నేను పడతాను.

మాధవ:—ఎలా నమ్మమన్నావ్?

మోహన్:—మామా! నా హృదయం చీల్చి చూడు. ఒక్క సుశీలకు తప్ప యితరులకు యీ హృదయంలో స్థానంలేదు.

కృష్ణ:—అలాంటి వాడివి ఉత్తరాలు వ్రాయడం మానుకున్నావేం?

మోహన్:—నేనా? మీరా? వారానికి రెండుమూడు ఉత్తరాలు వ్రాసినా మీరు జవాబువ్రాయందే. మీ క్షేమ సమాచారాలు తెలియక నేను ఎంత బాధపడ్డానో మీకేం తెలుసు.

మాధవ:—మాకు ఒక్క ఉత్తరం చేరందే!

కృష్ణ:—వ్రాసినవి నీ దగ్గరే పెట్టుకున్నావేమో!

మోహన్:—ఇదేదో కుట్ర! నేను నిజంగా వ్రాసి స్వయంగా పోస్టు చేశాను.

మాధవ:—అయితే యిదంతా రమేష్ కుట్రయి ఉండాలి. వాడిని సుశీల పెళ్లాడుతుందని కుట్ర పన్ని ఉంటాడు.

మోహన్:—నా ఉత్తరాలు మీకు అందకపోయినా యీ సంబంధం గురించి "నిజమేనా?" అని నాకు ఒక్క ముక్క వ్రాసినా నేను వచ్చి, యీ కుట్ర జరగకుండా చేసేవాడిని. మీ టెలిగ్రాం వచ్చేవరకు నాకేం తెలియందే.

మాధవ:—ఇదంతా నా దురదృష్టం!

మోహన్:—అశ్రద్ధచేత, చికాకుల చేత మీరు వ్రాయడంలేదేమోననుకున్నాను. వద్దామంటే కొత్త ఉద్యోగం, సెలవు పెట్టడానికి వీలులేకపోయింది. మామా! మందెవరిస్తున్నారు?

మాధవ:—డాక్టర్ గోపాల్

కృష్ణ:-ఇంకా డాక్టర్ రాలేదే! (అంటూ వెళ్తాడు)

మాధవ:—[ఆశ్చర్యంతో మోహన్ వంటినిండా ఉన్న కట్లు తడిమి చూచి] మోహన్, యిదేమిటి? వంటినిండా యీ దెబ్బలేమిటి?

మోహన్:—ఏం చెప్పను? రాత్రి మీ పెలిగ్రాం అందేసరికి Train time దాటిపోయింది ... అదృష్టవశాత్తు ఒక Private లారీ దొరికింది. అందులో ఎక్కి చాలాదూరం వచ్చాను. ఒక జంక్షన్‌లో నన్ను ఆ డ్రైవర్ వదిలి పెట్టాడు. కొంతదూరం ఆ చీకట్లో నడిచాను. ఏదో గ్రామం చేరాను. ఒకయింటిముందు ఒక కారు కనబడింది. ఆ యింట్లో ఏదో సందడిగా ఉంది. ఎవరినైనా ఆ యింట్లోవాళ్లని యీ ఊరుకి త్రోవ అడుగుదామనుకున్నాను.

మాధవ:—చెప్పలేదా?

మోహన్:—నేను ఎవరినీ అడగలేదే. కార్లో ఎవరైనా ఉన్నారేమో అని తొంగి చూశాను. స్విచ్ తాళాలు మాత్రం ఉన్నాయి. ఆశపుట్టింది! ఆ కారును డ్రైవ్ చేసుకుంటూ శీఘ్రంగా యిక్కడకు రావచ్చునని ఆశపడ్డాను. స్టార్ట్ చేశాను.

మాధవ:—దొంగతనం చేశావా?

మోహన్:—ఔను-నా సుశీల కోసం [మతి స్థిమితం తప్పినట్టుగా] నా సుశీలను ఎంత వేగంగా చూస్తానా అని......

మాధవ:—నీవు ప్రమాణాన్ని తప్పేవా?

మోహన్:—[వినిపించుకోకుండా] వేగంగా పోనిచ్చాను. శరవేగంగా కొంతదూరం పోనిచ్చాను. ఎదురుగా ఒక లారీ భూతంలా వచ్చింది. అంతే ... [ఆ దృశ్యం కళ్లకు కట్టినట్టుగా] అబ్బా! [బాధ పడతాడు]

మాధవ:—తర్వాత?

మోహన్:—తర్వాత కళ్లు తెరచి చూసేసరికి యీ ఊరిలోని ఆస్పత్రిలో ఉన్నానని తెలుసుకున్నాను. అతి కష్టంమీద అందులోనుంచి తప్పించుకుని యిలా వచ్చాను.

మాధవ:—[ఉద్రేకంతో] ఏం పని చేశావురా? దొంగతనమా చేశావు? నీ ప్రమాణాన్ని తప్పేవా?

మోహన్:—నా ప్రమాణాన్ని తప్పేనా? నేను చేసిన ప్రమాణాన్ని తప్పేనా? ... ఔను! తప్పేను! అడి తప్పేను! నాకు అతి ప్రియమైన నా సుశీల మీద చేసిన ప్రమాణాన్ని తప్పేను. [దుఃఖంతో] మామా! తెలియక చేశాను! మరచిపోయి చేశాను—ఉన్మత్తుణ్ణాయి చేశాను. ఆ ప్రమాదంలో నేను చనిపోయినా బాగుండేది! సుశీలా నా తప్పును క్షమించు! క్షమించు (అంటూ వెళ్లిపోతాడు)

గోపాల్:—(వస్తూ) ఏం ఎలాగుంది?

మాధవ:—అలాగే ఉంది. ఏం? మీరింత ఆలస్యంగా వచ్చారేం?

గోపాల్:—ఏం చెప్పను! సుశీలను చూసివచ్చి చెప్తా. (లోనికి వెళ్లివచ్చి) అర్ధరాత్రి పూట నా కారును, ఆ పల్లెటూరు వద్ద ఎవరో దొంగిలించారు. ఎలా రాను? తెల్లవారిన తర్వాత మొదటి బస్సులో వచ్చాను. నా కారు ట్రంకురోడ్ జంక్షన్‌లో పిప్పి పిప్పిఅయి పడుంది. ఆ కారు ఒక లారీతో డాష్ కొట్టిందిట. ఆ దొంగని ఆస్పత్రిలో పడేశారుట. ఇక్కడనుంచి నేనక్కడకే వెళ్లాలి.

మోహన్:—(వస్తూ, డాక్టర్! ఆ దొంగను నేనే!... దానికి తగిన ప్రతిఫలం అనుభవిస్తున్నాను.

గోపాల్:—నువ్వా!

కృష్ణ:—(నేపథ్యంనుండి) డాక్టర్! డాక్టర్!

గోపాల్:—(వెళ్లివచ్చి) లాభంలేదు-యీ యింజక్షన్ ఒక్క గంట ముందయినా యిచ్చి ఉంటే బ్రతికేది. వస్తాను. (వెళ్తాడు)

మాధవ:—యమ కింకరుడులా వచ్చావా నా కూతురు ప్రాణాలు తీయడానికి!

మోహన్:—(మొహం దించుకుని, బాధతో) ఔను; నేను నా చేతులారా నా సుశీల ప్రాణాలు తీయడానికివచ్చాను. చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకోలేనిదుర్బలుణ్ణి.

కృష్ణ:—(నేపథ్యంలోనుండి) నాన్నా! నాన్న! సుశీలా! సుశీలా (వెఱ్ఱికేకలు)

మాధవ:—(ఆత్రుతతో) అమ్మా సుశీలా! సుశీలా (వెళ్తాడు) అమ్మా సుశీలా (నేపథ్యంలో ఏడుపు)

మోహన్:—(బాధతో) ఆ! సుశీలా! వెళ్లిపోయావా! నేనూ...వ...స్తు...న్నా....అబ్బా...వ...స్తు న్నా...ఆఁ! (చనిపోతాడు)